# అమ్మణ్ణి ఆలయానికి రూ.2 లక్షల విరాళం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి దేవస్థానంలో నిత్య అన్నదాన పథకానికి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. బుధవారం తిరుపతికి చెందిన కొనెగారి సాయిసూరజ్‌రెడ్డి, శ్రీసుదీప్తి కుటుంబ సభ్యుల తరపున రెండులక్షలా రెండువేల 232 రూపాయల చెక్కును ఆలయ కార్యనిర్వహణ అధికారి ఆళ్ల శ్రీనివాసరెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక వార్త


వైసీపీ ఎమ్మెల్యేల

# ఫోన్ టాపింగ్ కలకలం

## నెల్లూరు జిల్లాలో వైసీపీ షాక్

వెంకటగిరి, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:



కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి

అధికార పార్టీకి చెందిన వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తమ ఫోన్లు టాపింగ్ చేశారని ఆరోపించారు. బుధవారం నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తన ఫోన్ టాపింగ్ చేశారని బహిరంగంగా సాక్షాలతో ఆరోపించారు. మంగళవారం ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి కూడా తన ఫోను కాల్స్ టాప్ జరిగిందని విమర్శించడం పాఠకులకు విదితమే. ఇరువురు ఎమ్మెల్యేలు తెలుగుదేశం పార్టీలో చేరవచ్చునని పార్టీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. తాను సీఎం జగన్మోహన్‌రెడ్డి తాత రాజారెడ్డి దగ్గర నుంచి విధేయుడిగా ఉన్నానని, తన ఫోన్ కాల్స్‌ను ప్రభుత్వం ట్యాపింగ్ చేయడం బాధ కలిగించిందని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మనస్తాపానికి లోనయ్యారు. తనకు అవమానం జరిగిందని, ఇక పార్టీలో ఉండలేనని ప్రకటించారు. రూరల్ ఎమ్మెల్యేగా శ్రీధర్‌రెడ్డి రెండు సార్లు వైసీపీ నుంచి గెలుపొందారు. వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం తనను పక్కన పెట్టి రాజ్యాంగ శక్తులను తిప్పుతున్నారని విమర్శించారు. తనకు పార్టీలో గుర్తింపు లేకుండా పోయిందని విచారం వ్యక్తం చేశారు. తన నిర్ణయం ఏ విధంగా ఉంటుందో ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని ఆనం ప్రకటించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఫోన్ కాల్స్ ట్యాపింగ్ కలకల జ్వాల చెలరేగింది. వైసీపీకి ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఇద్దరు ఎమ్మెల్యేలు దూరం అవుతుండడంతో పెద్ద షాక్ తగిలింది. వెంకటగిరి నియోజకవర్గంలో వైసీపీ సమన్వయకర్తగా నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డిని, నెల్లూరు గ్రామీణ నియోజకవర్గానికి సమన్వయకర్తగా మాజీ సెంట్రల్ బ్యాంకు చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డిలను వైసీపీ అధిష్టానం నియమించింది. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో రాజకీయాలు వేడెక్కాయి.

# రీసర్వే భూ రక్ష కాదు... జగన్‌రెడ్డి భూ భక్ష

## రైతుల పాసుపుస్తకాలపై జగన్ బొమ్మలా..! -టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్



పాదయాత్రగా వెళుతున్న నారా లోకేష్

పలమనేరు,ఫిబ్రవరి 1,ప్రభాతవార్త:

రీ సర్వే భూ రక్ష కాదని జగన్ రెడ్డి భూ భక్ష కార్యక్రమం అని రైతుల పాసుపుస్తకాలపై ముఖ్యమంత్రి బొమ్మలు ఏమిటని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ముఖ్యమంత్రిని ప్రశ్నించారు.యువగళం పాదయాత్ర 6వ రోజులో భాగంగా చిత్తూరు జిల్లా,పలమనేరు నియోజక వర్గం,బైరెడ్డిపల్లె మండలం కమ్మనపల్లె వద్ద కస్తూరిబా విడిది కేంద్రం నుండి ఆయన పాదయాత్రను ప్రారంభించారు.టిడిపి నాయకులు,కార్యకర్తలు,ప్రజలు అధిక సంఖ్యలో ఆయన పాదయాత్రలో పాల్గొన్నారు.దారిపొడవున ప్రజలను ఆయన ఆప్యాయంగా పలకరించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకున్నారు. కమ్మనపల్లె నుండి ప్రారంభమై పాదయాత్ర బెలుపల్లె మీదుగా పలమనేరు మండలంలోని కొలమాసనపల్లె,గొల్లపల్లె,రామాపురం మీదుగా కేటిల్‌ఫామ్ విడిది ప్రాంగణానికి చేరుకున్నారు.పాదయాత్ర క్రమంలో పలు ప్రాంతాలలో రైతుల ఆయన పలకరించి వారి సమస్యలను తెలుసుకునే క్రమంలో రైతులు పంటలకు పెడుతున్న పెట్టుబడులలో 50శాతం కూడా ధరలు రావటం లేదని ప్రభుత్వం నుండి ఇప్పటి వరకు సబ్సీడి ద్వారా డ్రిప్పులు,పరికరాలు,యంత్రాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

### సొంత భూములకు జగన్ బొమ్మలా...

పలమనేరు మండంలోని నక్కపల్లె వద్ద ప్రభుత్వం తలపెట్టిన భూ రీసర్వే సరిహద్దు రాళ్ళను నారా లోకేష్ పరిశీలించారు.ఈ మేరకు ఓ రైతు ఆతని భూమి ప్రభుత్వం రీ సర్వే చేసి ఉన్న విస్తీర్ణంలో కొంత తొలగించి నూతన పాసుపుస్తకాలను అందించిందని తెలిపారు.ఆ పాసుపుస్తకాన్ని చూసిన ఆయన ప్రభుత్వం రైతుల సొంత భూములను రీ సర్వే పేరుతో సర్వేలు చేసి వారి భూములకు అందించే పాసుపుస్తకాలలో ముఖ్యమంత్రి బొమ్మలు వేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు.రీ సర్వే భూముల రక్షణ కోసం కాదని జగన్‌మోహన్‌రెడ్డి భూ భక్షకని విమర్శించారు.గతంలో ఎంతో మంది ముఖ్యమంత్రులు రాష్ట్రన్ని పాలించారని ఎవరు జగన్‌లా రైతుల పాసుపుస్తకాలలో వారి బొమ్మలు వేసుకోలేదన్న విషయాన్ని గుర్తుచేశారు. కొలమాసపల్లె వద్ద మహిళలతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికలలో అధికారం కోసం మహిళలను మాయమాటలతో మోసగించారని విమర్శించారు.45 సంవత్సరాల వయస్సు ఉన్న ఎస్సీ,ఎస్టీ,బిసి మైనారిటీ మహిళలకు పెన్షన్లు అందిస్తామని హామీలు కురిపించిన ముఖ్యమంత్రి వాటిని అమలు చేశారా అని ప్రశ్నించారు.ఇంటిలో ఎంత మంది విద్యార్థులుంటే అందరికీ అమ్మఒడి ఇస్తామని నేడు ఇంటిలో ఒకరికి పరిమితి పెట్టారన్నారు. అదేవిధంగాజగన్ ప్రభుత్వంలో ప్రజలపై పన్నుల భారం పెరిగిందని నారా లోకేష్ తెలిపారు.గత ఎన్నికలలో జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ఏ ఒక్క హామీలను అమలుచేయలేదన్నారు. హామీలలోని సంక్షేమ పథకాలను ప్రజలకు క్రమం తప్పకుండా అందిస్తున్నామని ప్రజలను మోసగిస్తున్నారని విమర్శించారు. పథకాలను అందిస్తున్నామంటు చాప కింద నీరులా పెట్రోల్,డీజల్,వంట గ్యాస్ ధరల పెంపు, పన్నుల పెంపు,నూతనంగా చెత్త పన్ను,కరెంటు చార్జీల పెంపుతో ప్రజలను దోచుకుంటున్నారన్నారు.గత ప్రభుత్వంలో ఉన్న నిత్యావసర వస్తువుల ధరలను ప్రస్తుత నిత్యావసర వస్తువుల ధరలను ప్రజలు గమనించాలని సూచించారు.

# ఇక్కడ బతకలేకున్నాం బాబూ..!

## కేంద్ర బృందం ఎదుట ఇరకందీవి జాలర్ల గోడు

## పులికాట్ దీవులలో కేంద్రబృందం సభ్యులు



తడ, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త

పులికాట్ సరస్సు మధ్యలో ఉన్న దీవుల్లో కేంద్ర బృందం సభ్యులు పర్యటించారు. అయితే ఈ బృందం దీవుల పర్యటనలో సమస్యల పరిష్కారానికి ఏమాత్రం ఉపయోగపడుతుందో గాని జాలర్లు మాత్రం చుట్టుముట్టి తమ సమస్యలు ఏకరువుపెట్టారు. ముఖ్యంగా తడ మండలం ఇరకందీవిలోని తిరువెంకటనగర్ కుప్పంలో యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ బృందం పర్యటించినప్పుడు దీవి ప్రజలు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఇతర గ్రామాల్లాగా తాము కూడా అన్ని సౌకర్యాలు కలిగి జీవించాలని ఆశిస్తున్నామని, ఇక్కడి నుంచి తరలిపోవడమే తమ ముందున్న లక్ష్యమని వారు ఈ బృందం ఎదుట స్పష్టం చేశారు. మహారాష్ట్ర, ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన 39 మంది బృందం సభ్యులు పులికాట్ తీరప్రాంతంపై అధ్యయనం చేయడంతో పాటు ఒక వర్క్‌షాపు నిర్వహించాలని ఈ పర్యటన చేసింది. అటు సూళ్లూరుపేట మండలంలోని పేర్నాడు, తదితర పల్లెల్లోనూ ఈ బృందం పర్యటించినప్పుడు కనీస సౌకర్యాలు కావాలని ఆ దీవుల ప్రజలు ఈ బృందాన్ని కోరారు. కనీసం 30 చిన్నాపెద్దా గ్రామాలు ఉన్న పులికాట్ దీవుల్లో ఇప్పటికీ విద్య, వైద్యసౌకర్యాలు అంతంతమాత్రమే ఉండటంతో కేంద్ర బృందం సభ్యులు కూడా ఈ సమస్యలు తెలుసుకొని ఆశ్చర్యపోయారు. తాము ప్రభుత్వానికి నివేదిక ఇచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మాత్రం హామీ ఇచ్చారు.

# ప్రజలు వైసిపి ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు

\- మంత్రి రోజా



విజయపురం, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :

ప్రజలు వైసిపి ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని మంత్రి ఆర్.కె.రోజా అన్నారు. బుధవారం మండలంలోని ఎం.అగరంలో గడప గడపకు మీ ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆమె ఇంటింటికీ సంక్షేమ పథకాలు తెలిపే కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు చూసి జగన్మోహనరెడ్డి ప్రభుత్వాన్ని రెండో పర్యాయం కోరుకుంటున్నారని తెలిపారు. ప్రతి గడపకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, పింఛను, విద్యాదీవెన, అమ్మఒడి, ఆదరణ వంటి పథకాలు ఇంటికి చేరుతున్నాయని, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా వారి ఖాతాల్లోకి డబ్బులు చేరుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో తహాశీల్దారు అమరేంద్రబాబు, మండల వైసిపి ఉపాధ్యక్షుడు బాలకృష్ణ నాయుడు, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు గోవర్ధన్‌నాయుడు, వైస్ ఎంపిపిలు బాలాజీ, దశరధ, మండల వైసిపి అధ్యక్షుడు గోపినాథ్, ప్రధాన కార్యదర్శి మునికృష్ణ, నాయకులు రవినాయుడు, రమేష్‌రెడ్డి, సురేష్, సుధాకర్, ప్రసాద్‌నాయుడు, అరుణాచలం, గుణశేఖర్‌రెడ్డి, రాజగోపాల్, మురళీకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తవణంపల్లెలో రెండు డెంగ్యూ కేసులు నమోదు

## -ఆందోళనలో మండల ప్రజలు

తవణంపల్లె, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: మండలంలోని వేర్వేరు గ్రామాల్లో రెండు డెంగ్యూ కేసులు నమోదు కావడంతో మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ పైమాఘం గ్రామంలో డెంగ్యూ కేసు నమోదైంది. పైమాఘం గ్రామానికి చెందిన సీహెచ్.మానస్వి (3) అనే బాలికకు జ్వరం రావడంతో బాలిక తల్లిదండ్రులు గత రెండు రోజుల క్రితం చికిత్స నిమిత్తం వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు బాలికకు డెంగ్యూ జ్వరం సోకినట్లు నిర్ధారించారు. అలాగే వెంగంపల్లె గ్రామానికి చెందిన మహేష్‌రెడ్డి(16) అనే బాలుడికి కూడా గత రెండు రోజుల క్రితం డెంగ్యూ వ్యాధి సోకింది. గత నాలుగైదు రోజులుగా తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్న బాలున్ని మంగళవారం చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ బాలుడికి వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు బాలుడికి డెంగ్యూ వ్యాధి సోకినట్లు నిర్ధారించారు. రెండు మూడు రోజుల వ్యవది లోనే రెండు వేర్వేరు గ్రామాల్లో రెండు డెంగ్యూ కేసులు నమోదు కావడంతో మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో డెంగ్యూ కేసుల అనుమానితులను వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించాలని జిల్లా మలేరియా అధికారి ఎల్.శ్రీనివాసులు మండల వైద్యసిబ్బందిని ఆదేశించారు. డెంగ్యూ బాధిత గ్రామాల్లో జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు, సహాయ మలేరియా అధికారి ఆర్.రామచంద్రారెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ వి.కృష్ణారెడ్డిలు పర్యటించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో చేపట్టిన డెంగ్యూ నివారణ చర్యలను పరిశీలించి పలు సూచనలు చేశారు.

# రాష్ట్ర అభివృద్ధి జగనన్నకే సాధ్యం

## రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :



రాష్ట్ర అభివృద్ధి, గడప గడపకు సంక్షేమ ఫలాలు అందించడం కేవలం రాష్ట్ర ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డికే సాధ్యమవుతుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళాత్తూరు నారాయణస్వామి పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం పెరుమాళ్ళపల్లె సచివాలయం పరిధిలోగల మారేపల్లె హరిజనవాడ, మారేపల్లె, పెరుమాళ్ళపల్లె గ్రామాల్లో గడప గడపకు వెళ్ళి ప్రజా సమస్యలు తెలుసుకుని, అభివృద్ధి సంక్షేమ ఫలాల అమలు తీరును ప్రశ్నించి తెలుసుకుని, ప్రభుత్వం అందిజేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి దిశగా నిరంతరం కృషి చేస్తున్న యువనేతను ఆశీర్వదించాలనికోరారు. నవరత్నాల పథకాలను అమలు చేస్తూ ... ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామిల కన్న అధికంగా ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అందించడం జరుగుతుందన్నారు. అలాగే మారేపల్లె గ్రామంలో ఓ మహిళ జగనన్న అందిజేస్తున్న సంక్షేమ ఫలాల పై ఓ జానపద గేయం పాడి అకట్టు కుంది. ఈ కార్యక్రమంలో మారేపల్లె సర్పంచ్ అన్నూరాశి, పెరు మాళపల్లె సర్పంచ్ బండి శశిఆనంద రెడ్డి, ఎంపిటిసి తోకలమురళీ రెడ్డి, ఎంపిడివో సుధాకర్‌రావు, తహాశీల్దార్ పుల్లా రెడ్డి, సచివాలయ సిబ్బంది, జడ్పీటిసి చలం పాళ్యం సుకుమార్, వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమ సుందర్ రెడ్డి, జిల్లా వైసీపీ కార్యదర్శి కామసాని పద్మనాభ రెడ్డి, నాయకులు బట్టె సుబ్రమణ్యం, రామయ్య,ధనంజేయులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### న్యాయం చేయలేదని మహిళ ఆత్మహత్యాయత్నం!

డిప్యూటీ సీఎం తనకు న్యాయం చేయలేదని మారేపల్లె పంచాయితీకి చెందిన జాతీయ గ్రామీణ ఉపాధి పథకం క్షేత్ర సహాయకురాలు పొన్నెమ్మ పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మారేపల్లె దళితవాడలో చోటుచేసుకుంది.స్థానికుల మేరకు మారేపల్లె దళితవాడలో గడప గడప కార్యక్రమం నిర్వహిస్తున్న సందర్భంలో డిప్యూటీ సీఎం,అధికారుల సమక్షంలో పురుగుల మందు సేవించిన్నట్లు చెప్పారు. ఇటీవల జరిగినసామాజిక తనిఖీలలో అక్రమాలకు పాల్పడిన్నట్లు ఫీల్డ్ అసిస్టెంట్ పై తప్పుడు ఫిర్యాదులు చేయించి ఆమెను తొలిగించడానికి కారణమైన్నారని ఆరోపించారు.

ఉష్ణోగ్రతలు
1/2/2023



- తిరుపతి 28 డిగ్రీలు
- చిత్తూరు 30 డిగ్రీలు
- మదనపల్లి 23 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 29 డిగ్రీలు
- వెంకటగిరి 30 డిగ్రీలు
- గూడూరు 30 డిగ్రీలు

బంగారం ధరలు
1/2/2023



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 5, 415

24క్యారెట్స్ 1గ్రాము రూ.5,907

కోడిగ్రుడ్ల ధరలు
1/2/2023



కోడిగ్రుడ్డు :రూ.6.00

1 డజను: రూ.72.00

# ఎన్నికలకు పక్కావ్యూహంతో టిడిపి సిద్ధం !

## పుంగనూరు, పీలేరు పరిశీలకులుగా డాక్టర్ ఎన్‌బి, సూరా

తిరుపతి,ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:



తెలుగుదేశంపార్టీ అధినేత,మాజీ ముఖ్యమంత్రి సొంత చిత్తూరుజిల్లాలో ఎన్నికల నాటికి పార్టీని బలోపేతం చేసుకునే దిశగా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో యువగళం పాదయాత్ర చేపడుతున్న యువనేత, ఎమ్మెల్సీ నారాలోకేష్ పార్టీ శ్రేణులను ఉత్తేజపరుస్తూ ప్రజలకు చేరువగా పర్యటిస్తున్నారు.ఈ సమయంలో తెలుగు దేశంపార్టీకి చెందిన ఇద్దరు సీనియర్ నేతలకు కీలక నియోజకవర్గాలబాధ్యతలను అప్పగించారు అధినేత చంద్రబాబునాయుడు. టిడిపిలో రాష్ట్ర అధికారప్రతినిధిగా ,ప్రభుత్వంపై, వైసిపి నేతలపై సందోర్భచితంగా సోషల్‌మీడియాలో విరుచుకుపడుతున్న సైకాలజిస్టు డాక్టర్ ఎన్‌బి సుధాకర్‌రెడ్డిని చిత్తూరుజిల్లాలో కీలకనియోజకవర్గం,మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పుంగనూరు టిడిపి పరిశీలకుడుగా నియమించారు. ఇక ఇప్పటికే టిడిపి బలోపేతంగా ఉన్న,,వైసిపి సిట్టింగ్ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పీలేరు నియోజకవర్గంలో మరింత ప్రజల మద్దతు కూడగట్టుకునే దిశగా పార్టీ శ్రేణులను నడిపించేందుకు సీనియర్ నాయకుడు ,రాష్ట్ర కార్యదర్శి సూరాసుధాకర్‌రెడ్డికి పరిశీలకుడుగా బాధ్యతలు కట్టబెట్టారు. ఎన్నికల సమయానికి ఈ ఇద్దరు నేతలు ఆయా నియోజకవర్గాల్లో నాయకులు, కార్యకర్తల పనితీరును, పరిస్థితిని అంచనా వేస్తూ పార్టీ అధిష్టానానికి నివేదికలు, సూచనలు ఇవ్వనున్నారు.

# క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు ప్రణాళికలు సిద్ధం చేయండి

## -కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతిరూరల్, ఫిబ్రవరి01 ప్రభాతవార్త:

జిల్లాలో కాన్సర్ నిర్ధారణ పరీక్షలకు ప్రణాళిక సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. క్యాన్సర్‌కు ఖర్చుతో కూడుకున్న వైద్యం అందించాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో నిర్ధారణ, వైద్య సేవలు అందించి, ఆర్థికంగా, ఆరోగ్యపరంగా పేద ప్రజలకు అండగా నిలవాలని కలెక్టర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంలో క్యాన్సర్ వ్యాధిపై కలెక్టర్ వైద్య అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో క్యాన్సర్ వ్యాధులను గుర్తించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, ఇప్పటికే ప్రభుత్వ ప్రధాన కార్యధర్శి పలుమార్లు సూచనలు చేసారన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ హర్షవర్ధన్, స్విమ్స్ అంకాలజీ డాక్టర్ జయచంద్రారెడ్డి, వైద్య అధికారులు పాల్గొన్నారు.

# శివయ్య పండగకు ప్రత్యేక భద్రత

## ఉన్నతాధికారుల సమావేశంలో ఎస్‌పి పరమేశ్వరరెడ్డి

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 1 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 13 నుంచి ప్రారంభమయ్యే శివయ్య పండగకు దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులకు ప్రత్యేక భద్రత కల్పిస్తామని జిల్లా ఎస్‌పి పరమేశ్వరరెడ్డి ప్రకటించారు. బుధవారం శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరిగే బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఉన్నత స్థాయి,స్థానిక అధికారులతో త్రినేత్ర అతిధి గృహంలో సమీక్ష ఏర్పాటు చేసారు.ఈ సమీక్షలో ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు రాబోవు శివరాత్రికి తమకు కావాల్సిన సహాయ సహాకారాలను వివరించారు. ఇఓ వి కెసాగర్‌బాబు ఇప్పటి వరకు చేపట్టిన పనులను గురించి వివరించారు.వివిధ శాఖల నుంచి ఇప్పటి చేపట్టిన పనులకు సంబంధించి జిల్లా కలెక్టర్ బి.వెంకటరమణారెడ్డి అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి వచ్చే లక్షలాది మంది భక్తులకు సుదర్శనం, సత్వర దర్శనం,సుఖ దర్శనం కల్పించాలని ఇందుకు అన్ని శాఖలు దేవాదాయశాఖతో సమన్వయంతో పని చేయాలని సూచించారు. లింగోద్భవం అభిషేకానికి సంబంధించి దిశ దెస నిర్దేశం చేసుకొని ముందుకు సాగాలన్నారు. సుమారు 10రోజుల పాటు బ్రహ్మోత్సవాల్లో ఉత్సవాలకే ప్రాధాన్యత కాబట్టి పట్టణంలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక పోలీస్ కమాండ్ కంట్రోల్ రూం, సిసి కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. నగరానికి వచ్చే వాహనాలను నిరంతరం క్షుణ్ణంగా తనిఖీలు చేయటానికి పోలీసు చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తున్నామన్నారు.కళ్యాణోత్సవం సందర్భంగా బాల్యవివాహాల జరగకుండా ప్రత్యేక కార్యాచరణ చేపట్టామన్నారు. కళ్యాణోత్సవం సమయంలో బాల్యవివాహాలు జరగకుండా పోలీసు మహిళా సిబ్బంది,గ్రామ మహిళా పరిరక్షణ కార్యదర్శులు ఐసిడియస్ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.ప్రముఖులకు అనుకూల సమయంలో దర్శనం కల్పించేందుకు చర్చించారు. వైద్యసిబ్బంది ఎల్ల వేళల్లో అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, భక్తులకు అన్నదానాలు నిర్వహించే వారు ట్రాఫిక్‌కు అంతరాయం కల్గకుండా జరుపుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.



## రైతులకు రాగిసాగు.. చిరు ధాన్యాలపై అవగాహన

శాంతిపురం, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త



మండలంలోని కొలమడుగులో రైతులకు రాగిసాగు, చిరుధాన్యాల సాగుపై శిక్షణ కార్యక్రమంను ట్రైనీ కలెక్టర్ మేఘ స్వరూప్ ప్రారంభించారు. ఈసందర్భంగా రాగి పంట విత్తనుంచి నుంచి పంటకోత వరకు రైతులు అవలంబించాల్సిన విధానాలు, విత్తనశుద్ధి, నారుశుద్ధి, ఎరువుల యాజమాన్యం, నీటి యాజమాన్యం తదితరాలను ఎడిఎ అన్నపూర్ణమ్మ రైతులకు వివరించారు. రైతులు చిరుధాన్యాలసాగుపై మక్కువ చూపాలని ట్రైనీ కలెక్టర్ మేఘస్వరూప్ సూచించారు. కార్యక్రమంలో డిఎఓ హబీబ్‌బాషా, డిహెచ్ఓ మధుసూధన్‌రెడ్డి, సర్పంచ్ మంగమ్మ మంజునాథ్, ఎంపిటిసి రుక్మిణమ్మ దేవేంద్ర, ఎఓ అప్పోజి తదితరులు పాల్గొన్నారు.

## అందరి సంక్షేమం కోసమే పథకాలు

– ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

గుడిపాల, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:



ప్రజలందరి సంక్షేమం కోసమే సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. గుడిపాల మండలం బొమ్మసముద్రం సచివాలయం గొల్లమడుగు నుండి బుధవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాలను ప్రజల ఇళ్ళ వద్దకు వెళ్ళి ఎమ్మెల్యే వారిని అడిగి తెలుసుకొన్నారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ ఛైర్మన్ రమ్య, ఎంపిపి ప్రసాద్‌రెడ్డి, తహసిల్దారు బాబు రాజేంద్రప్రసాద్, ఎంపిడిఓ ఉపేంద్ర, మండల పార్టీ కన్వీనర్ జనార్దన్, ఆగ్రోస్ డైరెక్టర్ రమణ, మున్సిపల్ కో-అప్షన్ సభ్యుడు కోలా కిరణ్, సర్పంచ్‌లు రజనీకాంత్, జయకోడి, గణపతి, సర్పంచ్ సౌధ, మండలస్థాయి అధికారులు,నాయకులురెడ్డప్ప,సాయి,రవీంద్రారెడ్డి, వెంకిరెడ్డి, కన్నారెడ్డి పాల్గొన్నారు.

## సప్తగిరి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఉచిత వైద్యశిబిరం

చిత్తూరురూరల్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:



చిత్తూరు పట్టణం సప్తగిరి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం నందు బుధవారం ఆనందరాతి, ఎండి ఇండియా హెల్త్ ఇన్సూరెన్స్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరంను బ్యాంకు ఛైర్మెన్ ఏఎస్ఎన్ ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఛైర్మెన్ మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల అందరూ శ్రద్ధ వహించాలని, ఇటువంటి ఉచిత మెడికల్ క్యాంపులు త్వరలో ప్రాంతీయ కార్యాలయాలు, బ్రాంచ్‌ల నందు ఏర్పాటుచేస్తామని తెలిపారు. అనంతరం చిత్తూరు, తిరుపతి నగరాల్లోని ప్రముఖ వైద్యుల పర్యవేక్షణలో బ్యాంకు ఖాతాదారులకు, సిబ్బందికి ఉచిత రక్తపరీక్షలు, ఈసిజీ, కంటిపరీక్ష, దంతపరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజరు బి.కె.రవిశంకర్, విజిలెన్స్ ఆఫీసరు, విభాగాధిపతులు, ఆనందరాతి ఇన్సూరెన్స్ బ్రోకర్స్ తరపున వినీత్‌సింగ్, ఎండి ఇండియా హెల్త్ ఇన్సూరెన్స్ కార్పొరేట్ మేనేజరు శ్రావణ్‌కుమార్, సిబ్బంది తదితరులు పాలల్గొన్నారు.

## మండల గ్రామ సచివాలయాల కన్వీనర్‌గా సాయి

గుడిపాల, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:



గుడిపాల మండల గ్రామ సచివాలయాల కన్వీనర్‌గా సాయి ఎన్నికయ్యారు. చిత్తూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం గుడిపాల మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ ఎంపిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ గుడిపాల మండల పరిధిలో 17 గ్రామ సచివాలయాలు వున్నాయని, ప్రతి గ్రామ సచివాలయానికి ప్రభుత్వం ఇద్దరు కన్వీనర్లను ఏర్పాటు చేసిందన్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాలకు ఒక కన్వీనర్‌గా ఎన్నుకోవాల్సి వుండటంతో ప్రస్తుతం ఎంపికైన గ్రామ సచివాలయాల కన్వీనర్లు మండల సచివాలయ కన్వీనర్‌ను ఎన్నుకొంటున్నారన్నారు. మండలంలోని రామభద్రాపురం గ్రామంకు చెందిన సాయిను గుడిపాల మండల గ్రామ సచివాలయ కన్వీనర్‌గా ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ఎంపిపి ప్రసాద్‌రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ జనార్ధన్, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి



– జిల్లా సిపిఐ కార్యదర్శి నాగరాజు

చిత్తూరు, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:

కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో బుధవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చేయి చూపిందని జిల్లా సిపిఐ కార్యదర్శి నాగరాజు ధ్వజమెత్తారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించపోవడం, రాయలసీమ, ఉత్తరాంధ్రా ప్రత్యేక ప్యాకేజీకి నిధులు ఇవ్వకపోవడం, విశాఖ స్టీల్ ఫ్యాక్టరీకి నామమాత్రంగా నిధులు కేటాయించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ ఎన్నికలను దృష్టిలో వుంచుకొనా ఆ రాష్ట్రంలో ఓట్లు దండుకోవడానికి భారీ నిధులు కేటాయించడం అన్యాయమన్నారు.

## కేంద్ర బడ్జెట్‌లో ఉద్యోగులకు నిరాశ



– జిల్లా యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి జివి రమణ

చిత్తూరు, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:

కేంద్ర బడ్జెట్‌లో ఉద్యోగులకు కేంద్ర ఆర్థిక మంత్రి తీవ్ర నిరాశను కల్పించారని జిల్లా యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి జివి రమణ పేర్కొన్నారు. పార్లమెంటులో బుధవారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌పై ఆయన స్పందిస్తూ వేతన జీవులకు కేంద్ర బడ్జెత్‌తో ఒరిగిందేమి లేదన్నారు. గతంలో పోల్చితే 50 వేల రూపాయలు మాత్రమే పన్ను మినహాయింపు ఇచ్చారన్నారు. పెరిగిన జీవన ప్రమాణాలకు అనుగుణంగా 5 లక్షల రూపాయల వరకు పన్ను మినహాయింపు ఇవ్వాలని మెజార్టీ ఉద్యోగుల డిమాండ్‌ను పట్టించుకోలేదన్నారు. 7 లక్షల రూపాయల వరకు పన్ను లేదనేది కొత్త పన్ను విధానం అని అయితే ఇది ఉద్యోగులకు ఏ మాత్రం ఉపయోగం లేని విధానమని పేర్కొన్నారు.

## సీనియర్ డ్రైవర్ జయరామన్నకు ఘనసత్కారం

చిత్తూరురూరల్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:



గత 30 సంవత్సరాలుగా గృహనిర్మాణశాఖలో విధులు నిర్వహిస్తు మంగళవారం పదవీవిరమణ చేసిన సీనియర్ డ్రైవర్ జయరామన్నను రాష్ట్ర ప్రభుత్వ డ్రైవర్ల సంఘ అధ్యక్షులు పన్నీ ర్‌సెల్వం ఆధ్వర్యంలో ఘనంగా దుశ్శాలువతో సత్కరించారు. అనంతరం సంఘ భవనం నుంచి డ్రైవర్ సోదరులు ర్యాలీగా జయరామన్న ఇంటి వద్ద వరకు తీసుకువెళ్లి వదలి రావడం జరిగింది. అలాగే డ్రైవర్ సోదరులందరికీ సంఘ అధ్యక్షులు పన్నీర్‌సెల్వం లెదర్‌బ్యాగులను సంక్రాంతి కానుకగా అందజేసారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు సురేష్‌బాబు, పాల్‌రాజ్, బాలాజీ, మురాద్‌భాష తదితరులు పాల్గొన్నారు.

## కుప్పం - మారికుప్పం రైల్వేలైను

నష్టపరిహారం ప్రతిపాదనలు సిద్ధం చేయాలి – జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్

గుడుపల్లె, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త



కుప్పం నుంచి కర్ణాటకలోని మారికుప్పం వరకు నూతన రైల్వే లైను ఏర్పాటుకు అవసరమైన భూసేకరణకు సంబంధించిన నష్టపరిహారం ప్రతిపాదనలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు.బుధవారం కుప్పం - మారికుప్పం మధ్యన 12 కిలోమీటర్ల నూతన రైల్వే ట్రాక్ ఏర్పాటుకు సంబంధించి గుడుపల్లె మండలం అగరం, బిసానత్తం ప్రాంతాలను జాయింట్ కలెక్టర్ డా॥ వెంకటేశ్వర్‌తో కలసి పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూసేకరణలో భూములు కోల్పోయే వారికి అందించే నష్టపరిహారం ప్రతిపాదనలు త్వరగా పూర్తి చేయాలన్నారు. గుడుపల్లె మండలంలో 238.50 ఎకరాలు, కుప్పం మండలంలో 9.14 ఎకరాల భూమిని రైల్వే లైనుకు సేకరించడం జరిగిందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శివయ్య, తహశీల్దార్ గుర్రప్ప, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే సిఎం జగనన్న లక్ష్యం

– మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్

కుప్పం, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త



పేదల సంక్షేమమే సిఎం జగనన్న లక్ష్యమని కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ పేర్కొన్నారు. బుధవారం వైఎస్సార్ పెన్షన్ కానుకలో భాగంగా డయాలసిస్‌తో బాధపడుతున్న మల్లికమ్మ అనే మహిళకు పదివేల రూపాయల పెన్షన్ నగదును అందించారు. ఈసందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ ప్రతినెలా పేదల ఇళ్ల తలుపులు తట్టి వాలంటీర్లు లబ్దిదారులకు పెన్షన్లు అందిస్తున్నారన్నారు. ఏ ప్రభుత్వం అమలు చేయని రీతిలో సిఎం జగనన్న సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజలకు లబ్ది కలిగిస్తున్నారని ప్రజలు జగనన్నను మరింత ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ మునస్వామి, కమీషనర్ రవిరెడ్డి, కార్యదర్శి కృష్ణ పాల్గొన్నారు.

## వాహనాల వేలంతో రూ. 53వేల ఆదాయం

శాంతిపురం, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త

వివిధ ఎక్సైజ్ నేరాల్లో సీజ్ చేసిన వాహనాలను బుధవారం రాళ్లబూదుగూరు పోలీస్‌స్టేషన్‌లో చిత్తూరు సెబ్ అసిస్టెంట్ సూపరింటిండెండ్ ఆయేషా బేగం అధ్వర్యంలో ఎస్సై మునస్వామి బహిరంగ వేలం నిర్వహించారు. ఆరు మోటారు సైకిళ్లకు జిఎస్టీతో కలిపి 53808రూ.ల ఆదాయం రాగా ప్రభుత్వ ఖజానాలో జమ చేసినట్లు ఎస్సై తెలిపారు.

## లక్షరూపాయల విలువ చేసే మద్యం ధ్వంసం

కుప్పం, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త



వివిధ మద్యం కేసుల్లో సీజ్ చేసిన 2549మద్యం బాటిళ్లను, అలాగే 134.5లీటర్ల నాటుసారాను చిత్తూరు సెబ్ అసిస్టెంట్ సూపరింటిండెండ్ ఆయేషా బేగం అధ్వర్యంలో సెబ్ సిఐ కిషోర్‌కుమార్ జెసిబి యంత్రంతోధ్వంసంచేయించారు. ధ్వంసం చేసిన మద్యం విలువ లక్ష రూపాయల దాకా ఉ ంటుందన్నారు. కార్యక్రమంలో సెబ్ ఎస్సై వీరాస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## స్పందన అర్జీలు క్షేత్ర స్థాయిలో పరిశీలించి చర్యలు

– సకాలంలో ముఖ ఆధారిత హాజరు – కలెక్టర్ హరినారాయణన్

చిత్తూరు, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:

ప్రభుత్వం స్పందన కార్యక్రమంకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి అందిన అర్జీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని కలెక్టర్ హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. అలాగే ఉద్యోగులు సకాలంలో ముఖ ఆధారిత హాజరు వేయాలని స్పష్టం చేశారు. కలెక్టర్ హరినారాయణన్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్పందన, గడప గడపకు మన ప్రభుత్వం పనుల పురోగతి, ఉద్యోగుల ముఖ ఆధారిత హాజరు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన, జగనన్నకు చెబుదాం, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. స్పందన అర్జీలు తిరిగి రీ-ఓపెన్ కాకుండా పరిష్కరించాలన్నారు. ఫిర్యాదు వచ్చిన దానికి తగిన ఎన్‌డార్స్‌మెంట్ ఇచ్చి సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్ఓ రాజశేఖర్, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, ఆర్అండ్‌బి ఎస్ఇ దేవానంద్, డ్వామా పిడి గంగాభవానీ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ నాగజ్యోతి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి వెంకట్రావ్, సాంఘీక సంక్షేమశాఖ డిడి రాజ్యలక్ష్మీ, జిల్లా ప్రణాళిక అధికారి ఉమాదేవి, ఎపిఎస్‌పిడిఎల్ ఎస్ఇ శ్రీహరి, ఐసిడిఎస్ పిడి నాగశైలజ, కార్మిక శాఖ అధికారి ఓంకార్‌రావు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మూర్తి, అడల్ట్ ఎడ్యుకేషన్ డిడి నాగేశ్వరరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.త

## అర్హులైన ప్రతి ఒక్కరికి పక్కాగా సంక్షేమ పథకాలు

– ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

యాదమరి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:



అర్హులైన ప్రతి ఒక్కరికి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పేర్కొన్నారు. యాదమరి మండలం కొట్టాలం గ్రామ సచివాలయం పరిధిలో బుధవారం రెండవ రోజు జడ్పీ వైస్ ఛైర్మన్ భూమిరెడ్డి ధనంజయరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందాయా! లేదా! అని అడిగి తెలుసుకొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులై వుండి ఎవరికైనా పథకాలు అందకుంటే ప్రస్తుతం మళ్ళీ దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు పరిశీలించి వారికి మంజూరు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ ఛైర్మన్ భూమిరెడ్డి ధనంజయరెడ్డి, ఎంపిపి సురేష్‌బాబు, వైస్ ఎంపిపిలు రవీంద్ర, హరినారాయణరెడ్డిలు, మాజీ జడ్పీటిసీ మనోహరన్, ఎంపిడిఓ శివరాం, తహసిల్దారు చిట్టిబాబు, పిఆర్ ఎఇ జయచంద్రారెడ్డి, వ్యవసాయఅధికారిచరిత,ఎంపిటిసిపూజిత,సర్పంచ్‌నదియా,వైకాపానాయకులుమాదిరెడ్డిపల్లి మనోహర్‌రెడ్డి, సుబ్రమణ్యం, జగన్నాధం, గురునాధరెడ్డి, డేనియల్, గంగయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

## పిహెచ్‌సిల్లో అన్ని రకాల ల్యాబ్ పరీక్షలు

– జిల్లా ఇన్‌ఛార్జీ టిబి అధికారి డాక్టర్ రవిరాజు

యాదమరి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని ల్యాబ్‌ల్లో అన్ని రకాల పరీక్షలు నిర్వహించాలని జిల్లా ఇన్‌ఛార్జీ టిబి అధికారి డాక్టర్ రవిరాజు ఆదేశించారు. యాదమరి పిహెచ్‌సిని జిల్లా ఇన్‌ఛార్జీ టిబి ఆఫీసర్ డాక్టర్ రవిరాజు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ల్యాబ్‌లో నిర్వహిస్తున్న పరీక్షలను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ ఇక్కడే రోగులకు అన్ని రకాల పరీక్షలు చేయాలని ముఖ్యంగా టిబి రోగులకు తప్పనిసరిగా గల్ల పరీక్ష చేయాలని, టిబి నిర్ధారణకు వారు చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి శ్రమతో కూడుకొని వచ్చేలా చేయడం మంచిది కాదన్నారు. అలాగే వ్యాధి నిరోధక టీకాలను వంద శాతం పూర్తి చేయాలని, క్షేత్ర స్థాయిలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఆయన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం అమలుపై పిహెచ్‌సి డాక్టర్ సునీల్‌కుమార్‌ను అడిగి తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి డాక్టర్ సునీల్‌కుమార్, సిహెచ్ఓ లక్ష్మీనారాయణ, పిహెచ్‌సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బలిజ నేతలతో ఎమ్మెల్యే ఆరణి సమావేశం

చిత్తూరు, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:

ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు బుధవారం తన నివాసంలో బలిజ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బలిజ నేతలతో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ చిత్తూరులో బలిజ నేతలతో ఒక సమావేశం ఏర్పాటు చేసి సమస్యలపై చర్చించాలన్నారు. ఇందుకోసం వేదిక సిద్ధం చేయడంతో పాటు బలిజ సంఘ నేతలను సంప్రదించి వారికి అందుబాటులో వున్న తేదీలను ఖరారు చేయాలని కోరారు. ఈ సమావేశానికి బలిజ సంఘ నేతలందరినీ ఆహ్వానించాలని ఆయన కోరారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## వైభవంగా శ్రీ భీష్మ ఏకాదశి



వాకాడు, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త

వాకాడు మండలం బాలిరెడ్డిపాలెం గ్రామంలో వెలసి ఉన్న శ్రీ పట్టాభిరామాలయంలో భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామి వారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు దీవి అనంతాచార్యులు మాట్లాడుతూ హైందవ ధార్మిక ప్రపంచంలో పరమ పవిత్రమైన శ్రీ విష్ణు సహస్రనామాన్ని భీష్మ పితామహుడు లోకానికి అందించిన రోజుగా మాఘ మాసం శుక్ల ఏకాదశిని భావిస్తారని, దీనిని జయ ఏకాదశి, భీష్మ ఏకాదశి, భీమ ఏకాదశిగా కూడా పిలుస్తారని అన్నారు. స్వామి వారికి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు బడికాల వెంకటేష్, వెంకటకీర్తి ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ పూజా కార్యక్రమంలో సాయిబాబు స్వామి, చలపతి స్వామి, రాజా స్వామి, శ్రీరామసేన యువకులు గురుప్రసాద్, రాజేష్, ఉషమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రెండో రోజు ఘనంగా భావన ఋషి తిరునాళ్లు

వెంకటగిరి, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:



పద్మశాలి కులస్థుల ఆరాధ్య దైవమైన భావన ఋషి తిరునాళ్ల పట్టణంలో రెండో రోజు వైభవంగా జరిగింది. ఆరో వార్డు ఎన్టీఆర్ కాలనీలో భావన ఋషి కలశ ఊరేగింపు సందర్భంగా కౌన్సిలర్ మాడ జానకి రామయ్యఖడ్గమాల ఆరోపించారు. భావన ఋషి కలి శాలకుఘనంగాపూజలునిర్వహించారు.పట్టణంలోని బంగారుపేట,పద్మశాలివీధి,మల్లమ్మగుడివీధిప్రాంతాల్లోవాహనంలోభావనఋషితిరునాళ్లనిర్వహించారు.

## తడలో టీచర్ల ఎంఎల్‌సీ ఎన్నికల ప్రచారం

తడ, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త



తూర్పు రాయలసీమ టీచర్ ఎంఎల్‌సీగా పోటీ చేస్తున్న ఎలసి రమణారెడ్డి తడ మండలంలో పలు పాఠశాలలకు వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఎపిటిఎఫ్ బలపరుస్తున్న ఈ అభ్యర్థి మండల నాయకులతో కలిసి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, మోడల్ స్కూల్ లతో పాటు పలు ఉన్నత పాఠశాలల వద్ద టీచర్లను కలిసి తనను గెలిపించాలని కోరారు. సిపిఎస్ రద్దు, అనేక సమస్యల పరిష్కారం కోసం తనవంతు పోరాటం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎపిటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

## నేడు తడ మండల సర్వసభ్య సమావేశం

తడ, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త

తడ మండల సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం జరుగుతుందని ఎంపిడిఓ ఎవి మురళీకృష్ణ తెలిపారు. ఈ 6వ సర్వసభ్య సమావేశంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష జరుగుతుందన్నారు. ఇప్పటిదాకా జరిగిన అభివృద్ధి గురించి చర్చిస్తామని, ప్రభుత్వ ఉత్తర్వులు చదివి వినిపిస్తామని చెప్పారు. మండలంలోనిప్రజాప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఎంపిడిఓ పేర్కొన్నారు.

## నేడు ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం

తడ, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త

పులికాట్, నేలపట్టు ప్రాంతాల్లో గురువారం ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం జరుపుతున్నట్లు సూళ్లూరుపేట వన్యమృగ సంరక్షణ శాఖ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా నేచర్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం సందర్భంగా పులికాట్ సరస్సు తీరంలోని అటకానితిప్ప వద్ద,తడమండలంవేనాడుమార్గంలోగురువారంమధ్యాహ్నంఈకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

## ప్రభుత్వాసుపత్రిలో రక్తదాన శిబిరం

కోట, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త

కోట ప్రభుత్వాసుపత్రిలో బుధవారం వాకాడు ఆర్టీసీ డిపో కార్మికులు 25 మంది రక్తదానం చేశారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ మధుశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకరు రక్తదానం చేయడం వల్ల మరొకరి ప్రాణాన్ని కాపాడవచ్చని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో రక్తం అందక ఎంతోమంది మృత్యువాత పడుతున్నారని తెలిపారు. సామాజిక బాధ్యతగా యువత ముందుకొచ్చి రక్తదాన శిబిరాల్లో పాల్గొని రక్తదానం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమ్మ, ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ రాజా తదితరులు పాల్గొన్నారు.

## హౌసింగ్‌పై లబ్ధిదారులకు అవగాహన



వాకాడు, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త

జగనన్న లే అవుట్‌లో మంజూరైన పక్కా గృహాలు, పిఎంఎవై గృహాలు వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించాలని లబ్ధిదారులకు బుధవారం హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు. వాకాడులోని ఒకటవ సచివాలయం ఆవరణం పరిధిలోని గృహ నిర్మాణంను నిర్మించుకొను టకు లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జగనన్న లే అవుట్‌లో మంజూరైన పక్కా గృహాలు, పిఎంఎవై పక్కా గృహాలు వెంటనే నిర్మించుకోవాలని సూచించారు. బిల్లులు కూడా సకాలంలో గృహాలు నిర్మాణం చేపట్టిన వారికి ఇస్తున్నామన్నారు. వెంటనే పక్కా గృహాలు మొదలుపెట్టాలని లబ్ధిదారులను ఆయన కోరారు. వాకాడు ఉప సర్పంచ్ పాపా రెడ్డి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ జగనన్న లే అవుట్‌లో మంజూరైన పక్కా గృహాలు, పిఎంఎవై పక్కా గృహాలు మంజూరైన వారందరూ నిర్మించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి బండి వెంకట రత్నమ్మ, ఈవోపిఆర్‌డి ఉమామహేశ్వర రావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రోషన్ కుమార్, వర్క్ ఇన్స్‌పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మృతి

కోట, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త

కోట మండలం కొత్తపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి రిటైర్డ్ అయిన చెంగల్‌రాయుడు అనారోగ్యంతో మృతిచెందినట్లు యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు జనార్దనం చెప్పారు. ఆ మేరకు వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు.

## పాఠశాల తనిఖీ చేసిన ఎంఇఓ

దొరవారిసత్రం, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త



దొరవారిసత్రం మండలం శింగనాలత్తూరు, నేలపట్టు ప్రాథమికోన్నత పాఠశాలలను బుధవారం ఎంఇఓ దారా మస్తానయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పలు రికార్డులను, విద్యార్థుల హాజరు పట్టి, మధ్యాహ్న భోజన పథకం వివరాలు పరిశీలించారు. అనంతరం అక్కడ జరుగుతున్న మనబడి నాడు-నేడు పనులను పరిశీలించారు. వేగంగా పనులు పూర్తి చేయాలని ఆయన సూచించారు. విద్యార్థులను పలు అంశాలపై అడిగి తెలుసుకున్నారు.

## పంచదార, కందిపప్పు లేనట్లే

కోట, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త

సామాన్యులకు బతుకు భారమవుతోంది. ధరలు పెరుగుదల నేపథ్యంలో సరుకులు కొనుగోలు చేయలేక ఆహారపు అలవాట్లు మార్చుకోవాల్సి వస్తోంది. ఈ దశలో చౌకధరల దుకాణం ద్వారా వచ్చే కొన్ని ముఖ్య వస్తువులైనా తక్కువ ధరలకిస్తారని ఆశించారు. కానీ, ఈ పథకం కింద అందాల్సిన సరుకులు ఒక్కొక్కటిగా తగ్గిపోతున్నాయి. కేంద్రప్రభుత్వం పేదలకు అందిస్తున్న ఉచిత బియ్యమా లేక రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రూపాయికి కిలో బియ్యమా అర్థం కావడం లేదు. జనవరి నుంచి బియ్యం పంపిణీ ఒకే కోటాకి కుదించేశారు. కందిపప్పు, చక్కెర పంపిణీ చేయాల్సి ఉండగా, నేటికీ పంపిణీ జరగడం లేదు. బియ్యం మాత్రమే తీసుకెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జనవరిలో అరకొరగా కందిపప్పు, చక్కెర అందించి చేతులు దులుపుకున్నారు. బహిరంగ మార్కెట్లో కందిపప్పు రూ.115 నుంచి రూ.125 ధర ఉంది. పౌర సరఫరాల దుకాణాల ద్వారా రాయితీతో రూ.67కే ఇచ్చే వారు. అంటే కార్డుదారుడు బయట కిలో కందిపప్పు కొనాలంటే రూ.50 నుంచి రూ.60 వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది.

## యువగళం పాదయాత్రలో వెదురుకుప్పం నేత అడుగులు

వెదురుకుప్పం, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :

తెలుగు దేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ కుప్పంలో ప్రారంభించిన యువగళం పాదయాత్ర తొలి రోజు నుంచి వెదురుకుప్పంకు చెందిన క్లస్టర్ ఇన్‌చార్జీ,మాజీ టీడీపీ జిల్లా కార్యదర్శి మోహన్ మురళి అడుగులు వేస్తున్నారు. ఆరో రోజు బుధవారం సాగుతున్న పాదయాత్రలో లోకేష్ వెంట సాగుతున్నారు. యువనేత ప్రజా సమస్యల పై ప్రత్యేక దృష్టి కేటాయించి సమస్యలు తెలుసుకుంటున్నారని చెప్పారు. ఆయనతో పాటు మాజీ మంత్రి అమర్నాధ రెడ్డి ఉన్నారు.

## మూతపడ్డ మరుగుదొడ్లు-అవస్థల్లో ప్రయాణీకులు

చౌడేపల్లి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త

స్థానిక బస్టాండు సమీపంలో మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. నిరంతరం ప్రయాణీకులతో రద్దీగా వుండే బస్టాండులో మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడేవారు. దశాబ్దాల తరబడి మరుగుదొడ్ల కోసం స్థానికులు అధికారులను వినతి పత్రాలందించారు. దీంతో స్పందించిన అధికార యంత్రాంగం ఆరోగ్య కేంద్రానికి వెళ్ళే మార్గంలో మరుగుదొడ్లను ప్రారంభించారు. అయితే వాటి ఆలనా పాలనను ఎవరూ పట్టించుకోక పోవడంతో ప్రారంభించిన కొన్నాళ్ళకే మూత పడింది. దీంతో మరుగుదొడ్లు లేక ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధుల పరిస్థితి దారుణంగా తయారైంది. అధికారులు స్పందించి మరుగుదొడ్లను వాడుకలోకి తీసుకురావాలని స్థానికులు ప్రయాణీకులు కోరుతున్నారు.

## గడువులోపు ఇళ్ళ నిర్మాణాలు పూర్తి

– కమిషనర్ డాక్టర్ జె.అరుణ

చిత్తూరు, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:

నిర్దేశించిన గడువులోపు ఇళ్ళ నిర్మాణాలను పూర్తి చేయాలని కమీషనర్ డాక్టర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. కమీషనర్ డాక్టర్ జె.అరుణ బుధవారం అనుపల్లి హౌసింగ్ లేఅవుట్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి 15 నాటికి నిర్దేశించిన ఇళ్ళ నిర్మాణాలను కచ్చితంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. దీనిపై అనిమిటీ కార్యదర్శులతో కమీషనర్ సమీక్షించారు. బేస్‌మెంట్ స్థాయిలో వున్న నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ శ్రీధర్, అనిమిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## గణనాధుని సేవలో వినుగొండ ఎమ్మెల్యే



కాణిపాకం, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:

పల్నాడు జిల్లా వినుగొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు బుధవారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆయనకు వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అలాగే శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. ఆయన వెంట ఆలయ సూపరెండెంట్ శ్రీనివాస్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబుతదితరులు పాల్గొన్నారు.

## తడ జడ్పీ హైస్కూల్ ఆటస్థలంపై జడ్పీ ఛైర్‌పర్సన్‌కు వినతి

తడ, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త



తడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆటస్థలం క్రికెట్ పోటీల నిర్వహణకు అభివృద్ధి చేయాలని పూర్వ విద్యార్థులు, పలు క్రీడా పోటీల నిర్వాహకులు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ ఆటస్థలాన్ని అభివృద్ధి చేయాలని ఇటీవల సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యను స్థానికులు కోరారు. ప్రస్తుతం ఆయన అనుమతితో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌ను కలిసి అభ్యర్థించారు. ఇప్పటికే ఆక్రమణలకు గురవుతున్న ఈ స్థలాన్ని కాపాడటంతో పాటు వివిధ మండలాల క్రీడాకారులు కూడా ఇక్కడ పోటీలు నిర్వహించుకునేందుకు అనుకూలంగా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా కోరారు. ఎప్పుడూ రద్దీగా ఉండే తడ-శ్రీకాళహస్తి మార్గంలోనే ఈ హైస్కూలు ఉన్న కారణంగా తిరుపతి జిల్లాలోని వివిధ మండలాల నుంచి క్రీడాకారులు ఇక్కడికి వచ్చి ఆటలు ఆడుకునే అవకాశం ఉందని ఈ సందర్భంగా తెలిపారు. తడ మాజీ సర్పంచ్ జయకృష్ణతో పాటు పలువురు ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌ను కలిసి సమస్యను వివరించారు.

# లలితా జ్యువలరీ షోరూమ్ ప్రారంభించిన మంత్రులు



లలితా జ్యువలరీస్ షోరూమ్‌ను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి



లలితా జ్యువలరీస్ షోరూమ్‌ను ప్రారంబభిస్తున్న మంత్రి ఆర్‌కె రోజా.

చిత్తూరు, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: చిత్తూరు వేలూరు రోడ్డులోని చామంతిపురంలో బుధవారం రాష్ట్ర భూగర్భగనులు, అటవీ, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కె రోజాలు లలితా జ్యువలరీస్ నూతన షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కె రోజాలు మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో లలితా జ్యువలరీస్ 38 సంవత్సరాలకు పైగా సేవలిందిస్తూ అగ్రగామిగా గుర్తింపు తెచ్చుకొందన్నారు. చిత్తూరు నగరంలో బుధవారం లలితా జ్యువరీస్ 46వ షోరూమ్ ప్రారంభించిందని, తెలుగు రాష్ట్రాల్లో ఇది 20వ షోరూమ్ అన్నారు. లలితా జ్యువలరీస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో ప్రస్తుతం వున్న లలితా జ్యువలరీస్ షోరూమ్‌లకు వినియోగదారుల నుండి దక్కిన ఆదరణను చూసి ఇక్కడే మరిన్ని షోరూమ్‌లు ఏర్పాటు చేసి తమ సేవలను మరింత విస్తృతం చేయను న్నామన్నారు. లలితా జ్యువలరీస్‌లో వినియోగదారుల కోసం ఫ్లెక్సీ ఓ ఫ్లెక్సీ పథకంను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఈ పథకంలలో 11 నెలల పాటు వినియోగదారులు 1000 రూపాయల నుండి 10 వేల రూపాయల వరకు వాయిదా రూపంలో చెల్లించి బంగారు నగలు కొనుగోలు చేయవచ్చు నన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రెడ్డప్ప, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అరుణ, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానందరెడ్డి, డిప్యూటీ మేయర్లు ఆర్.చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌లు, స్థానిక కార్పొరేటర్ ఇందు తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణ అయ్యోరు ముంగిట భక్తి కార్యక్రమాలు



సూళ్లూరుపేట/తడ, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త : సూళ్లూరుపేట చరిత్రలో ఆధ్యాత్మిక, సాహితీ రంగాల్లో పేరుపొందిన వినుకొండ కృష్ణమాచార్యులకు ఇప్పటికీ పర్వదినాలలో భక్తులు ఘనంగా నివాళి అర్పిస్తున్నారు. కృష్ణ అయ్యోరుగా ఆయన సమీప ప్రాంతాల్లోనూ పేరుపొందారు. గత శతాబ్దంలో ఒక దివ్యత్వం కలిగిన రుషిగా ఈ ప్రాంత ప్రజలు చెప్పుకుంటారు. బుధవారం భీష్మ ఏకాదశి సందర్భంగా పట్టణంలోని శ్రీబాలాంజనేయస్వామి దేవస్థానంలో కృష్ణ అయ్యోరు చిత్రపటాన్ని ఉంచి అఖండ భజన చేస్తున్నారు. వారి ప్రభావం తరువాతి తరాలలో కూడా ఆధ్యాత్మిక ప్రభావాన్ని చూపిస్తుందని స్థానిక పెద్దలు నమ్ముతున్నారు. 1910లో జన్మించిన ఈ సద్గురు 40 ఏళ్ల క్రితం దాకా పట్టణంలోనే ఉంటూ చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లి ధూపదీప నైవేద్యాలను సమర్పించి భగవన్నామ స్మరణ దిశగా భక్తులకు మళ్లించేవారు. అప్పటి ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోనూ ఈయనకు ఎంతో పేరుంది. మీడియా, సోషల్ మీడియా లేని రోజుల్లో రేడియో, కరెంటు కూడా లేని గ్రామాల్లో సముద్ర తీరంలో ఉన్న పులికాట్ సరస్సుకు వెళ్లి కృష్ణమాచార్యుల వారి ప్రవచనాల కోసం ఎదురు చూసేవారు ఎంతోమంది ఉన్నారని ఇప్పటికీ పెద్దలు చెప్తుంటారు. హిందూ సంప్రదాయాలను, సనాతన ధర్మాలను పండిత పామరుల చెంతకు తీసుకెళ్లిన కృష్ణ అయ్యోరును ఇప్పటికీ తలుచుకొని ఆధ్యాత్మి కార్యక్రమాలు చేపడుతున్న వారిని పలువురు అభినందిస్తున్నారు. ఆయన కొన్ని పుస్తకాలను కూడా రచించి ఏడు దశాబ్దాల క్రితమే భీష్మ ఏకాదశి సందర్భంగా 24 గంటల అఖండ భజన ప్రారంభించారని, ఆ పరంపర ఇప్పటికీ ఇక్కడ కొనసాగుతూ బుధవారం ఆయన చిత్రపటాన్ని పక్కన ఉంచుకొని అఖండ భజన నిర్వహిస్తున్నామని నిర్వాహకులు చెప్పారు.

# వేగవంతంగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి

**- పాలేరు హౌసింగ్ లేఅవుట్‌ను పరిశీలించిన కలెక్టర్ హరినారాయణన్**



బంగారుపాళ్యం, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. బంగారుపాళ్యం మండలం పాలేరు హౌసింగ్ లేఅవుట్‌ను కలెక్టర్ హరినారాయణన్ జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారికి దగ్గరగా వున్న ఈ లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకొన్న లబ్దిదారులు వారి నివాసాల్లో నివాసం వుండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వివిధ స్థాయిల్లో వున్న మిగిలిన ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలని, ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన మౌళిక సదుపాయాలను లబ్దిదారులకు కల్పించే విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ద వహించి విధులు నిర్వర్తించాలన్నారు. పాలేరు హౌసింగ్ లేఅవుట్‌లో మొత్తం 87 ఇళ్ళు మంజూరు కాగా ఇందులో ప్రస్తుతం 10 ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయ్యాయని ఎంపిడిఓ హరిప్రసాద్‌రెడ్డి కలెక్టర్‌కు వివరించారు. అలాగే ఇక్కడ బిబిఎల్ పరిధిలో 3, బిఎల్ స్థాయిలో 34, ఆర్ఎల్ స్థాయిలో 25, ఆర్‌సి స్థాయిలో 15 ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయని ఎంపిడిఓ వివరించారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకొన్న లబ్దిదారులు ఇళ్లలో నివాసం వుండడానికి సిద్ధంగా వున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పలమనేరు ఆర్డీఓ శివయ్య, తహసిల్దారు బెన్నురాజ్, ఎంపిడిఓ హరిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అధిక ఆదాయం వచ్చేలా చర్యలు

**- జిల్లా కలెక్టర్ హరినారాయణన్**
**- ఉద్యానవన పంటలసాగును ప్రోత్సహించాలి !!**

కుప్పంరూరల్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త : తక్కువ పెట్టుబడితో రైతులకు అధిక ఆదాయం వచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదేశించారు. బుధవారం మండలంలో జిల్లా కలెక్టర్ జాయింట్ కలెక్టర్ డా॥ వెంకటేశ్వర్‌లతో కలసి విస్తృతంగా పర్యటించారు. దాసేగానూరులో కేశవులు అనే రైతు సాగు చేస్తున్న బొప్పాయి పంటను పరిశీలించారు. బొప్పాయిసాగు రైతులకు హెక్టారుకు 22వేలు ప్రోత్సాహకంగా అందిస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అలాగే అదేగ్రామంలో సాగులో ఉన్న దానిమ్మ తోటను పరిశీలించారు. దానిమ్మ సాగు రైతులకు 32వేల రాయితీని ఉద్యాన సమగ్ర అభివృద్ధి పథకంలో అందించడం జరుగుతోందన్నారు. అనంతరం కమతమూరులో ఉద్యానవన ఉత్పత్తుల సేకరణ కేంద్రాన్ని పరిశీలించారు. తిరుమల తిరుపతి దేవస్థానం, ఇతర ఆలయాలకు అందిస్తున్న పూల వివరాలు, మార్కెటింగ్ వివరాలను ఎఫ్‌బిఎ సభ్యులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం ఉద్యానవన శాఖ రాయితీతో ఏర్పాటుచేసిన పాలీహౌస్‌లో కనకాంబరం పూలసాగును కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో పలమనేరు ఆర్డీఓ శివయ్య, జిల్లా ఉద్యానవన అధికారి మధుసూధన్‌రెడవ్డి, తహశీల్దార్ సురేష్‌బాబు, ఉద్యానవన అధికారి డింపు ప్రియ, ఎంపిడిఓ జానకమ్మ, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## ఘంటసాల విగ్రహానికి పాలాభిషేకం



తిరుపతి,ఫిబ్రవరి 1ప్రభాతవార్త: ప్రముఖ సినీనేపథ్య గాయకుడు ఘంటసాల విగ్రహానికి బుధవారం ఉదయం రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి పాలాభిషేకం చేశారు. ప్రతినెలా 1వతేదీ ఘంటసాల జీవితాన్ని గుర్తుచేస్తూ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఘంటసాల అభిమాని కవితను రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి ,సభ్యులు కొట్టేసుబ్రమణ్యంరెడ్డి, టీచర్ తిరుమలయ్య, విజయకుమార్‌రెడ్డి, ఏవన్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఏకంలో భక్తుల కోలాహలం...ముగిసిన దర్శనాలు



శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 1 ప్రభాతవార్త : కొన్ని సంవత్సరాల తరువాత కల్కిఆశ్రమంలో అమ్మా భగవాన్ వారం రోజుల పాటు భక్తులకు దర్శనం అవకాశం కల్పించారు. ఒక్కొక్క రోజు కనీసం 50వేల మందికి తగ్గకుండా దర్శన భాగ్యం కల్గించారు. దేశ విదేశాల నుంచి భక్తులు కిట కిట లాడింది. బుధవారం మధ్యాహ్నం అమ్మా భగవాన్ చివరి దర్శనం అవకాశం అందించారు. శ్రీకాళహస్తికి సుమారు 40 కిలో మీటర్ల దూరంలో తమిళనాడు సరిహద్దుల్లో నిర్మించిన పాలరాతి ప్యాలెస్ ఏకం బుధవారం దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో బారులు తీరారు. వారం రోజులుగా ఉత్తర భారత దేశంలోని న్యూఢిల్లీ,కాశి నుంచి భక్తులు తండోపతండాలుగా వస్తున్నారు. రోజుకు సుమారు 500 బస్సుల్లో అమ్మాభగవాన్ భక్తులు వచ్చారు. బుధవారం కేవలం తెలుగురాష్ట్రాలకు చెందిన భక్తులనుమాత్రమే అనుమతించారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సుమారు 50వేల మందికి పైగానే భక్తులు దర్శించుకున్నట్లు సమాచారం. బుధవారంతో అమ్మాభగవాన్ దర్శనాలు ముగిసాయి. బుధవారం దర్శించుకున్న వారిలో అడ్వకేట్ జనరల్ లక్ష్మణ్‌రావు జబర్దస్ సుదాకర్,పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

## న్యాయస్థానాలపై గౌరవంలేని సిఎం



తిరుపతి,ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: సొంతపార్టీకి చెందిన, ప్రజల విశ్వాసమనే ఓట్లతో గెలిపించిన ఎమ్మెల్యేలపై నమ్మకంలేని నాయకుడు ముఖ్య మంత్రి పదవిలో ప్రజలను ఎలా నమ్ముతాడని, చట్టం, రాజ్యాంగం అమలుచేసే న్యాయస్థానాలు తీర్పుచెప్పినా గౌరవంలేని వైఎస్ జగన్ ముఖ్య మంత్రి పదవిలో ఉండటానికి అర్హత లేదని టిడిపి నేతలు నిరసనతెలిపారు. గత కొద్ది రోజులూగా రాష్ట్రంలో వైసిపి ఎంపిలు, ఎమ్మెల్యేలు కొందరు తమ ఫోన్‌లు ట్యాపింగ్, సిఎం జగన్ పనితీరుపై, పార్టీలో అవినీతి అక్రమాలపై మాట్లాడితే ఆ ఎమ్మెల్యేలపై విరుచుకుపడుతున్నాడని, దీనివల్ల సొంత పార్టీ నేతలపై నమ్మకంలేని జగన్ ప్రజలపై ఏం నమ్మకం పెట్టుకుంటాడని ఎద్దేవాచేశారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, వాటిపై నోరుతెరిస్తే బలవంతంగా కేసులు పెట్టడం, బెదిరించడం చేస్తున్నాడని టిడిపి కార్పొరేటర్ ఆర్‌సి మునికృష్ణ, నాయకులు ఊట్లసురేంద్రనాయుడు, శ్రీరాములు, అశోక్, ధనంజయ్, సుధాకర్‌రెడ్డి తదితరులు పోస్టర్లను చేతబట్టుకుని నిరసనతెలిపారు.

## తుడ లే అవుట్‌ల అభివృద్దికి భూములు కేటాయించండి : తుడ ఛైర్మెన్

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: జిల్లాలో తుడ లే అవుట్‌ల అభివృద్దికి భూములను కేటాయించాలని, కేటాయించిన భూములకు ప్రభుత్వ ధరలను చెల్లించనున్నామని, మోడ్రన్ టౌన్ షిఫ్‌లు ఏర్పాటు చేయనున్నామని తుడ ఛైర్మెన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని రెవెన్యూ డివిజనల్ అధికారులతో తుడ ఛైర్మెన్ చెవిరెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తుడ ఛైర్మెన్ మాట్లాడుతూ మోడరన్ టౌన్‌షిప్‌ల ఏర్పాటు వల్ల మధ్యతరగతి కుటుంబాలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. అన్ని మౌళిక వసతులు విద్యుత్, అంతర్గత రహదారులు, కమ్యూనిటీ హాల్స్, రచ్చబండ వంటి నిర్మాణాలు చేపట్టనున్నామని తెలిపారు. ఇప్పటికే సూరప్ప కాశంలో మధ్యతరగతి కుటుంబాలకు వెయ్యి మంది లబ్ది పొందారని తెలిపారు. ఉపయోగంలో లేని భూములను కేటాయిస్తే తుడ చేపట్టే అభివృద్ధి వల్ల ఉపాధి అవకాశాలు కలుగుతుందన్నారు. తుడ అభివృద్ధి వల్ల ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. పుత్తూరు, నగరిలో పార్కుల అభివృద్ది చేపట్టామని, శ్రీకాళహస్తి స్వర్ణముఖి నది వద్ద ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జె.సి. బాలాజీ, తుడ వీ.సి. హరికృష్ణ, సెక్రటరీ లక్ష్మీ, డిఆర్వో శ్రీనివాసులు, ఆర్‌డిఓ కనకనరసారెడ్డి, రామారావు, కిరణ్‌కుమార్, చంద్రముని, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## పశుసంవర్ధకశాఖ కార్యక్రమాలు పరిశీలించిన కేంద్రబృందం

శ్రీకాళహస్తిరూరల్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త : కేంద్రప్రభుత్వ పశుసంవర్ధకశాఖ కార్యక్రమాలును ఎలా అమలుచేస్తున్నారు అవి ఎంత వరకు పశుసంవర్ధక పాడిరైతులకు అందుతున్నాయన్న విషయాలపై బుధవారం కేంద్ర పశుసంవర్ధక మరియు పాడిపరిశ్రమశాఖ కార్యదర్శి, ఐఎఎస్ అధికారి రాజేష్‌కుమార్ బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. మండలంలోని చల్లపాళెం గ్రామంలో రైతు భరోసా కేంద్రంను సందర్శించి సబ్సిడీ ద్వారా అందిస్తున్న ఇన్‌పుట్స్‌ను పారదర్శకంగా కియోస్క్ పనితీరును పరిశీలించాలని అధికారులకు ఆదేశించారు. పాడిరైతుల సమస్యలను అడిగి తెలుసుకుని పశుగ్రాస విత్తనాలను పంపిణీచేశారు. శ్రీకాళహస్తిలోని పశువ్యాధి నిర్ధారిత ప్రయోగశాలను మరియు సంచార పశువైద్యసేవా వాహనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్రప్రభుత్వ సలహాదారు సుమేధ్ సోపాన్, రాష్ట్ర పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ డాక్టర్ అమరేంద్రకుమార్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ ఎ.రవికుమార్, స్థానిక సహాయ సంచాలకులు డాక్టర్ ఎన్‌వి.శ్రీకాంత్‌బాబు, డాక్టర్ ఊహ తదితరులు పాల్గొన్నారు.

## సింగిల్‌విండో ఛైర్మన్‌గా ఓబుల్‌రెడ్డి



పెద్దపంజాణి ఫిబ్రవరి 1 ప్రభాతవార్త : పెద్దపంజాణి మండల సింగిల్‌విండో అధ్యక్షుడిగా మండలానికి చెందిన సీనియర్ వైకాపా నేత రెడ్డివారి ఓబుల్‌రెడ్డి(సంపల్లి బాబు)ని నియమించారు. ఈమేరకు ఆయన బుదవారం నియామక పత్రాలను అందుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగిల్‌విండో ద్వారా రైతులకు, ప్రజలకు తక్కువ వడ్డీకే బ్యాంకు, నగలపై రుణాలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సింగిల్‌విండో అభివృద్ధికి అన్నివిధాలా చర్యలు తీసుకుంటామన్నారు.రైతులకు అన్ని విధాల అందుబాటులో ఉండి బ్యాంకు తరపున తగు సహాయసహకారాలు అందిస్తామన్నారు. బ్యాంకుకు శాశ్వత భవన నిర్మాణంకోసం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,డిసిసిబి ఛైర్మన్ రెడ్డెమ్మతో చర్చిస్తా మన్నారు. అదే విధంగా బ్యాంకు పరిధిలో ప్రజలసౌకర్యార్థం నూతనంగా ఏటిఎం కేంద్రం ఏర్పాటుకు సైతం చర్యలు తీసుకుంటామన్నారు. సింగిల్‌విండో పరిధిలో రైతులకు మరింత విస్తృత సేవలుఅందేలా చర్యలు తీసుకుంటామన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపి మిథున్‌రెడ్డి,ఎమ్మెల్యే డా.వెంకటేగౌడ, జెడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు (వాసు), మండలకన్వీనర్ బాగారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో సిఈఓ రామరాజు, డైరక్టర్లు బి.కృష్ణారెడ్డి,రెడ్డెమ్మ,వైస్ ఎంపిపి జి.డి.బాబు,తుర్లపల్లి సర్పంచ్ మురళి,ఎంపిటిసి సుబ్రమణ్యం,వైకాపా నాయకులు డా.జాఫర్, రెడ్డిబాషా, శివ తదితరులు పాల్గొన్నారు.

## చేపలు పట్టేందుకు వెళ్లి వ్యక్తి మృతి

శాంతిపురం, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త : పాలారు నదిలో చేపలు పట్టేందుకై వెళ్లిన ఓ వ్యక్తి నీట మునిగి మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా.. మండలంలోని కడపల్లి పంచాయతీకి చెందిన కుమార్ (33) అనే వ్యక్తి కుప్పం మండలం గణేష్‌పురం వద్ద ఉన్న పాలారు నదీ ప్రాంతానికి చేపలు పట్టేందుకై వెళ్లాడు. అయితే అక్కడ చేపలు పట్టేప్రయత్నంలో నీట మునిగి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వేగంగా అభయ్ యాప్ సర్వే : డిప్యూటీ డిఎంహెచ్‌ఓ



చిత్తూరు, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: ఆరోగ్యశ్రీ, ప్రభుత్వ వైద్య సర్వీసుల సేవలకు సంబంధించి అభయ్ యాప్ సర్వే వేగంగా పూర్తి చేయాలని డిప్యూటీ డిఎంహెచ్‌ఓ హరినాథరెడ్డి ఎఎన్‌ఎంలను ఆదేశించారు. నగర పాలక సంస్థ ఆరోగ్య అధికారి డాక్టర్ లోకేష్‌తో కలిసి డిప్యూటీ డిఎంహెచ్‌ఓ డాక్టర్ హరినారాథరెడ్డి సత్యనారాయణపురం, కాజూరు, మురకంబట్టుల్లోని అర్బన్ హెల్త్ సెంటర్లు, దొడ్డిపల్లి, సాంబయ్యకండ్రిగ వార్డు సచివాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అర్బన్ హెల్త్ కేంద్రాల్లో రోగులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి సిబ్బందితో సమీక్షించారు. ఎఎన్‌ఎంలు అభయ్ యాప్ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఆరోగ్యశ్రీ సేవలు అందుకొన్న వారి వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులపై సమీక్ష నిర్వహించి పరిసరాలను పరిశుభ్రంగా వుంచి దోమలను కట్టడి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌ఓ నరసింహ, వైద్యాధికారులు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

## "నారాయణతి నమోనమో...వేంకటేశా....

**శ్రీవేంకటేశం మనసాస్మరామి..**
**-భక్తిభావం పంచిన విష్ణుసహస్రనామ పారాయణం**



తిరుమల,ఫిబ్రవరి 1ప్రభాతవార్తప్రతినిధి: లోకక్షేమం కాంక్షిస్తూ కొండపై చేపట్టిన విష్ణుసహస్రనామ పారాయణంలో భీష్మ ఏకాదశి సందర్భంగా బుధవారం ఉదయం విష్ణుసహస్రనామ అఖండపారాయణం జరిగింది.పారాయణం ప్రారంభంలో అన్నమాచార్యప్రాజెక్టు కళాకారులు నారాయణతే నమోనమో... అంటూ చివరగా శ్రీవేంకటేశం మనసాస్మరామి...అంటూ ఆలపించిన భక్తిసంకీర్తనలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. విష్ణుసహస్రనామ స్తోత్రాన్ని పఠించడం వల్ల విశేష ఫలితాలు సిద్దిస్తాయని పురాణాలలో ఉన్నట్లు పండితులు చెప్పారు.

## ఏర్పాట్లు,క్యూలైన్లను పరిశీలించిన ఎస్‌పి



శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 1 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 13 నుంచి ప్రారంభమయ్యే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఇప్పటి వరకు ఆలయ ఇంజనీర్లు చేపట్టిన ఏర్పాట్లను బుధవారం జిల్లా ఎస్‌పి పరమేశ్వరరెడ్డి తమ సిబ్బందితో కలసి పర్యవేక్షించారు. ఆయనకు ఆలయ ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు,ఇఓ వి కెసాగర్‌బాబు,ఇఇ మురళీధర్‌రెడ్డి, డివైయస్‌పి విశ్వనాథం, సిఐ అంజూయాదవ్‌లు క్షేత్ర స్థాయిలో సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. దక్షణ గోపురం నుంచి ప్రారంభమై పొన్న చెట్టు నీడ వద్ద ఏర్పాటు చేసిన గేట్లను పరిశీలించారు. అలాగే కంచుగడప వద్ద నుంచి ఆలయంలోపలకు క్యూలైన్ల ఏర్పాటును పరిశీలించారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో ఉత్సవ మూర్తులను ఆలయం నుంచి తీసుకు రావటం తీసుకెళ్ళటం జరుగుతుందని రద్దీని నియంత్రించుకుంటూ ఉత్సవాలు నిర్వహించాలని భద్రతా అంశాలకు సంబంధించిన అన్ని వివరాలను పరిగణలోకి తీసుకొని పటిష్టమైన క్యూలైన్లు ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.పరిశీలనానంతరం ఎస్‌పి పరమేశ్వరరెడ్డి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆయనతో పాటు డివైయస్‌పి విశ్వనాథం,సిఐ అంజూయాదవ్, భాస్కర్ నాయక్, ఎస్ఐ తిమ్మయ్య,ఆలయ అధికారులు అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున్ ప్రసాద్, ఇఇ మురళీధర్‌రెడ్డి, ఎఇఇ కిషోర్, వర్క్ ఇన్సెపెక్టర్లు ప్రతాప్ సూర్యప్రతాప్ పాలక మండలి సభ్యులు మున్నా, బుల్లెట్ జయశ్యాం, రమాప్రభ, కొండూరు సునీత, లక్ష్మీ,జయమ్మ, ప్రత్యేకాహ్వానితులు చింతామణి పాండు, పాలమంగళం నీలా, జూలుగంటి సుబ్బారావు,పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తిలో భీష్మఏకాదశి వేడుకలు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం భీష్మఏకాదశి విశేష పూజలు నిర్వహించారు. ఇక్కడి ఆలయంలో నెల నెలా ఒక ఉత్సవం ప్రత్యేకంగా నిర్వహిచటం ఆనవాయితి.దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రికి ముందు నిర్వహించే ఉత్సవంలో భీష్మఏకాదశి, ఏటి ఉత్సవం(పంచమూర్తుల చక్రస్నానం),ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్నాయి. సాధారణంగా ఆలయానికి భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. ఏడాదిలో ఒక్క రోజు మాత్రమే స్వామి అమ్మవార్లు విజ్ఞానగిరి(కుమారుస్వామి కొండ) వద్దకు వెళ్ళి ఆప్రాంత భక్తులకు దర్శనమివ్వటం ఆనవాయితి. ఆలయంలో రెండు కాలాల్లో స్వామి అమ్మవార్లకు భక్తుల సేవలతో అభిషేకం నిర్వహిస్తారు. మూడో కాలం దేవస్థానమే నిర్వహించి స్వామి అమ్మవార్లను, కుమారస్వామిని చక్కగా ఆలయంలోని అలంకారమండపంలో ముస్తాబు చేసి గ్రామోత్సవంగా కుమారస్వామి తిప్పవద్దకు చేర్చుతారు. అక్కడ సాయంత్రం వరకు పూజలందుకున్న స్వామి అమ్మవార్లుతోపాటు కుమారస్వామి ఉత్సవమూర్తులు తిరిగి గ్రామోత్సవంగా ఆలయానికి చేరింది. ఈ సందర్భంగా ఆలయాధికారులు కుమారస్వామి తిప్ప వద్ద చక్కగా పందిళ్ళు వేసి స్వామి అమ్మవార్లను ప్రతిష్టింపజేశారు. అర్చకులు పూజలు జరిపి తీర్థ ప్రసాదాల్ని భక్తులకు పంచిపెట్టారు. చుట్టుపక్కల భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఇఓ వికె.సాగర్‌బాబు, ఆలయాధికారులు పర్యవేక్షించారు.

## ఆటలపోటీలకు ఉద్యోగులు సై

**-నేటి ఉదయం లాంఛనంగా ప్రారంభం**



తిరుమల,ఫిబ్రవరి 1ప్రభాతవార్తప్రతినిధి: నిత్యం విధి నిర్వహణలో ఒత్తిడితో ఉండే టిటిడి ఉద్యోగులు, అధికారులకు మానసిక ఉల్లాసం కలిగించడం కోసం ఏటా నిర్వహించే వార్షిక క్రీడలకు తిరుపతిలోని టిటిడి పరిపాలన భవనం ప్రాంగణం, ఎస్వీఉన్నతపాఠశాల మైదానం, ఎస్వీ ఆర్ట్సు కళాశాల మైదానం, శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ సిద్ధమయ్యాయి. గురువారం ఉదయం తిరుపతిలోని టిటిడి పరిపాలన భవనం మైదానంలో ప్రారంభంగా టిటిడి ఇఓ ఏవి ధర్మారెడ్డి, జెఇఓ వీరబ్రహ్మం జెండా ఊపుతారు. పురుషులకు, మహిళలకు వేర్వేరుగా పోటీలు నిర్వహస్తారు.

# కార్మిక, ప్రజా వ్యతిరేక,కార్పొరేట్ అనుకూల బడ్జెట్!

**-తిరస్కరించాలని వామపక్షాల పిలుపు**



తిరుపతి ప్రెస్‌క్లబ్,ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: 2023-24 ఆర్థిక సంవత్సరానికి మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ అన్నది కార్మికులకు, రైతులకు, శ్రమజీవులకు,ప్రజలకు వ్యతిరేకంగా,కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ఉందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి అన్నారు. బుధవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ దేశంలో ఉన్న నిరుద్యోగాన్ని నిరుద్యోగాన్ని పోగొట్టడానికి కానీ,పెరుగుతున్న ధరలను తగ్గించడానికి గానీ,దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి గానీ ఈ బడ్జెట్ సహాయపడదన్నారు. కేవలం ప్రైవేట్ పెట్టుబడులకు అనుకూలంగా ఉన్న ఈ బడ్జెట్‌ను అన్ని వర్గాల ప్రజలు తిరస్కరించాలని ఆయన పిలుపునిచ్చారు.కేంద్ర ప్రభుత్వ పథకాలైన ఐసిడిఎస్, మధ్యాహ్న భోజనం, జాతీయ ఆరోగ్య మిషన్,జాతీయ జీవనో పాధుల మిషన్‌కు నిధులు పెంచలేద న్నారు. గ్రామీణ ఉపాధిహామీ పథకాలకు సైతం కోతలు విధించడం బాధాకరమన్నారు. ఈ బడ్జెట్‌లో గొప్పలు చెప్పుకోవడం తప్ప వాస్తవాలకు చోటు లేదన్నారు.ఈ ప్రజావ్యతిరేక బడ్జెట్ ప్రతి ఒక్కరు తిరస్కరించాలని కందారపు మురళి విజ్ఞప్తి చేశారు.

**బడ్జెట్ వల్ల తిరుపతి జిల్లాకు ఒరిగిందేంటి?**

**-సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు సూటి ప్రశ్న**



కేంద్ర ప్రభుత్వం తరపున నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌కు సమర్పించిన బడ్జెట్ వల్ల తిరుపతి జిల్లాకు ఒరిగిందేమీ లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు అన్నారు.కేంద్ర ప్రభుత్వ పరిధిలోని విద్యాసంస్థల పనిని వేగవంతం చేసేందుకు,ఆధునీకరించేందుకు సరైన కేటాయింపులు జరగలేదన్నారు. మన్నవరం ప్రాజెక్టును నిలుపుకునేందుకు ప్రయత్నాలేవీ లేవని,జిల్లా ప్రజల మనోభావాలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వ పథకాలకు కేటాయి ంపులు లేకపోవడం విచారకరమన్నారు.సిఆర్ఎస్‌ను బలోపేతం చేయడానికి అవసరమైన నిధులు కేటాయింపులు గానీ,చర్యలు కానీ లేవని విమర్శించారు. మోడీ ప్రజా వ్యతిరేక,కార్పొరేట్ అనుకూల బడ్జెట్‌ను తిరుపతి జిల్లా ప్రజలు తిరస్కరించాలని,మోడీ విధానాలను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.